ప్రాజెక్టుల అప్పగింతపై వెనకడుగు

- తొలుత అప్పగింతకు అంగీకరించిన తెలంగాణ ప్రభుత్వం
- విమర్శలు వెల్లువెత్తడంతో ఒప్పుకోబోమని స్పష్టీకరణ
- తాజాగా కేంద్ర జల్‌శక్తి శాఖకు రేవంత్‌రెడ్డి సర్కారు లేఖ
- జనవరి 17 సమావేశ మినిట్స్‌ను సవరించాలని విన్నపం
- నేడు రెండు రాష్ట్రాలతో కేఆర్‌ఎంబీ కీలక సమావేశం
- ఆపరేషన్ ప్రొటోకాల్ ఖరారుపై చర్చించాలని నిర్ణయం

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన 15 ఔట్‌లెట్లను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు అప్పగించేందుకు తొలుత అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు వెనకడుగు వేసింది. ఇంటా, బయటా తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో తెలంగాణ డిమాండ్లను పరిష్కరించే వరకూ ఆ ప్రాజెక్టులను అప్పగించేది లేదని కేంద్రానికి స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కేంద్ర జల్‌శక్తి శాఖకు లేఖ రాసింది. ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టం ప్రకారం శ్రీశైలం డ్యామ్ ఏపీ పరిధిలో, సాగర్ డ్యామ్ తెలంగాణ పరిధిలో ఉండాలి. కానీ, గతేడాది నవంబర్ 29న ఏపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా సాగర్ డ్యామ్‌ను అక్రమించడంతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ జనవరి 17న తెలంగాణ, ఏపీ అధికారులతో న్యూఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. శ్రీశైలం, సాగర్ డ్యామ్‌లతోపాటు వాటికి సంబంధించి 15 ఔట్‌లెట్లు, ఉద్యోగులను బోర్డుకు అప్పగించాలని ఆదేశించారు. అందుకు ఏపీతోపాటు, తెలంగాణ సర్కారు కూడా అంగీకరించింది. దీంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని రాష్ట్ర ఇంజినీర్లు, సాగునీటి రంగం నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయంపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో దాదాపుగా 10 రోజులపాటు తర్జన భర్జన పడిన రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు వెనకడుగు వేసింది. ప్రాజెక్టులను అప్పగించబోమంటూ కేంద్ర జల్‌శక్తి శాఖకు లేఖ రాసింది.

తెలంగాణ వాదనలను తప్పుగా రికార్డ్ చేశారు..

ప్రాజెక్టుల అప్పగింతకు తొలుత తెలంగాణ అంగీకరించినట్టు జనవరి 17 నాటి సమావేశ మినిట్స్‌లో కేంద్ర జల్‌శక్తి శాఖ స్పష్టంగా తెలియజేసింది. దీంతో ఆ మినిట్స్‌ను తప్పుబడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ప్రభుత్వం అక్రమంగా సాగర్ డ్యామ్‌ను ఆక్రమించిన ఉదంతం నేపథ్యంలో ఇరు రాష్ట్రాలతో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ వాదనలను సరిగా రికార్డు చేయలేదని, తాము అంగీకరించని అంశాలను కూడా అంగీకరించినట్టుగా రికార్డు చేశారని అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రాజెక్టుల అప్పగింతపై ప్రభుత్వ అభిప్రాయం తీసుకున్న తర్వాత నిర్ణయం తెలియజేస్తామని మాత్రమే చెప్పామని, దీనికి విరుద్ధంగా 15 ఔట్‌లెట్ల అప్పగింతకు అంగీకరించినట్టు మినిట్స్‌లో నమోదు చేశారని ఆ లేఖలో పేర్కొంటూ.. మినిట్స్‌ను సవరించాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా ఆపరేషన్ ప్రొటోకాల్, 50:50 నిష్పత్తిలో నీటి వాటా, జల విద్యుత్తు ప్రాజెక్టులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ తదితర అంశలపై తెలంగాణ చేసిన వాదనలను రికార్డు చేసి వాటిని కూడా మినిట్స్‌లో నమోదు చేయాలని కోరింది. ట్రిబ్యునల్ అవార్డు, ఆపరేషన్ ప్రొటోకాల్ ఖరారైన తర్వాతే ప్రాజెక్టుల స్వాధీనానికి చర్యలు చేపట్టాలని, అప్పటివరకు ప్రాజెక్టులను అప్పగించబోమని కేఆర్‌ఎంబీ 17వ సమావేశంలోనే స్పష్టం చేశామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. సాగర్ డ్యామ్‌పై సీఆర్పీఎఫ్ బలగాలు అవసరం లేదని పేర్కొన్నది.

నేడు కేఆర్‌ఎంబీ కీలక సమావేశం

ప్రాజెక్టుల అప్పగింతకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర జల్‌శక్తి శాఖ జనవరి 17 సమావేశంలో రెండు రాష్ట్రాలతోపాటు కేఆర్‌ఎంబీకి మార్గదర్శకాలను జారీ చేసింది. ఆయా ప్రాజెక్టులు, ఔట్‌లెట్ల ఆపరేషన్ ప్రొటోకాల్ తదితర సాంకేతిక అంశాలపై చర్చించుకుని వారం రోజుల్లోగా కచ్చితమైన కార్యాచరణ ప్రణళికను ఖరారు చేయాలని ఆ మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. దీంతో ఆపరేషన్ ప్రొటోకాల్ ఖరారుపై తెలంగాణ, ఏపీ ఈఎన్సీలతో కేఆర్‌ఎంబీ గురువారం కీలక సమావేశాన్ని నిర్వహించనున్నది. పూర్తి యాక్షన్‌ప్లాన్‌తో ఈ సమావేశానికి రావాలని రెండు రాష్ట్రాలకు సూచించింది. ఈ సమావేశాన్ని బహిష్కరించాలని రాష్ట్ర అధికారులు తొలుత భావించినప్పటికీ అంతిమంగా హాజరుకావాలనే నిర్ణయించుకున్నట్టు తెలిసింది. కేంద్ర జల్‌శక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖను కేఆర్‌ఎంబీకి కూడా అందజేసి అవే వాదనలు బోర్డుకు నివేదించాలని తెలంగాణ అధికారులు సిద్ధమైనట్టు సమాచారం.

త్వరలో ఫ్రాన్స్ కాన్సులేట్ ప్రారంభం

హైదరాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని టీహబ్‌లో ఏర్పాటు చేస్తున్న ఫ్రాన్స్ కాన్సులేట్-హైదరాబాద్ కార్యాలయాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు కాన్సుల్ జనరల్-బెంగళూరు థెయిరీ బెర్తెలోట్ తెలిపారు. బుధవారం సచివాలయంలో ఆయన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫ్రాన్స్ కాన్సులేట్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అనువైన వాతావరణం తదితర అంశాలను మంత్రి వివరించారు.

పెట్టుబడులకు టెలీ పెర్ఫార్మన్స్ కంపెనీ ఆసక్తి

ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ టెలీ పెర్ఫార్మన్స్ ప్రతినిధులు మంత్రి శ్రీధర్‌బాబును సచివాలయంలో కలిశారు. ఈ నెల 5 నుంచి 8 వరకు ఐటీసీ కోహినూర్‌లో నిర్వహిస్తున్న ఇమ్మెర్సివ్ ఈవెంట్‌కు అతిథిగా రావాలని మంత్రిని వారు ఆహ్వానించారు. దేశ వ్యాప్తంగా తమ సంస్థలో 90 వేల మంది ఉద్యోగులు, ప్రపంచవ్యాప్తంగా 95 దేశాల్లో 5 లక్షల మందికిపైగా ఉద్యోగులు, 300పైగా భాషల్లో పనిచేస్తున్నారని మంత్రికి వివరించారు. త్వరలోనే హైదరాబాద్‌తో పాటు ద్వితీయ శ్రేణి నగరాలుగా ఉన్న పలు జిల్లా కేంద్రాల్లోనూ తాము తమ సంస్థను ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మమతా లాంబా చెప్పారు. ప్రభుత్వం తరపున అన్ని సహాయసహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

లోకం పోకడ

ఒత్తిడికి, ఆందోళనకు గురి కావొద్దు.. ఎన్నికల పరీక్షలో నీ ప్రతిభను బట్టే ఫలితం వుంటుంది!

నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ సీటుకు మల్లు రవి దరఖాస్తు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ కోసం ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, మాజీ ఎంపీ మల్లు రవి దరఖాస్తు చేసుకున్నారు. తన తండ్రి తరపున మల్లు రవి కుమారుడు సిద్ధార్థ్ గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు దరఖాస్తు సమర్పించారు. తనను ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధిగా నియమించినప్పటికీ ఎంపీగా పోటీచేస్తానని మల్లు రవి గతంలోనే ప్రకటించారు. ఎంపీగా పోటీచేయడానికి ఆ పదవి అడ్డు వస్తే, దానిని వదులుకుంటానని వెల్లడించారు. మల్కాజిగిరి నుంచి టికెట్ కోసం మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ దరఖాస్తు చేశారు.

ధాన్యం కొనుగోళ్లకు కొత్త నిబంధనలు

- మూడేండ్లు 200 కోట్ల వార్షిక టర్నోవర్
- స్థానికంగా ఆఫీసు ఉండాలని మరో మెలిక
- ప్రీబిడ్ మీటింగ్‌లో తీవ్రంగా వ్యతిరేకించిన మిల్లర్లు, వ్యాపారులు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నిబంధనలపై బుధవారం నిర్వహించిన ప్రీబిడ్ మీటింగ్‌లో వ్యాపారులు, మిల్లర్లు పలు అభ్యంతరాలను వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా రెండు నిబంధనలను వారు తీవ్రంగా వ్యతిరేకించినట్టు సమాచారం. గత యాసంగికి సంబంధించి 35 లక్షల టన్నుల ధాన్యాన్ని గ్లోబర్ టెండర్ల ద్వారా కొనుగోలు చేయాలని పౌరసరఫరాల సంస్థ నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేసిన సదరు సంస్థ.. బుధవారం పౌరసరఫరాల భవన్‌లో కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆధ్వర్యంలో ఆసక్తిగల వ్యాపారులతో ప్రీబిడ్ మీటింగ్‌ను నిర్వహించింది. వరుసగా మూడేండ్లపాటు వార్షిక టర్నోవర్ రూ.200 కోట్లు ఉండాలని అర్హతల్లో నిబంధన పెట్టింది. అది కూడా నిత్యావసర సరుకుల వ్యాపారం (కమాడిటీస్ ట్రేడింగ్)లో మాత్రమే ఉండాలని మెలిక పెట్టింది. దీనిపై రాష్ట్ర మిల్లర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం టెండర్లలో పాల్గొనకుండా తమను నిరోధించేందుకే ఈ నిబంధన పెట్టారని విమర్శిస్తున్నారు. బిడ్డింగ్‌లో పాల్గొనే కంపెనీకి స్థానికంగా ఏడాది నుంచి ఆఫీసు ఉండాలని అధికారులు మరో నిబంధన పెట్టారు. దీనిపై ఇతర రాష్ట్రాల వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గ్లోబర్ టెండర్లు పిలిచి స్థానికంగా ఏడాది నుంచి ఆఫీసు ఉండాలన్న నిబంధన విధించడం ఏమిటని వారు ప్రశ్నించినట్టు సమాచారం. దేశవ్యాప్తంగా ఎక్కడైనా వ్యాపారం చేసే తాము ప్రతి రాష్ట్రంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోలేము కదా? అని ప్రశ్నించినట్టు వినికిడి. దీనిపై అధికారులు స్పందిస్తూ.. టెండర్లు దక్కించుకున్న తర్వాత ఏమైనా సమస్యలు వస్తే ఆయా వ్యాపారుల కోసం తాము ఇతర రాష్ట్రాల చుట్టూ తిరగాల్సి వస్తుందని, అందుకే ఇక్కడ ఆఫీసు ఉండాలన్న నిబంధన పెట్టామని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీనిపై వ్యాపారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం.

పశుసంవర్ధక శాఖలో రిటైర్మెంట్లు

- ఈ ఏడాది 13 మంది అధికారుల ఉద్యోగ విరమణ
- జాబితా విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): పశుసంవర్ధక శాఖ ఈ ఏడాది భారీగా రిటైర్మెంట్లు ఉండనున్నాయి. ఈ మేరకు ఉద్యోగ విరమణ చేసే అధికారుల జాబితాను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అదర్ సిన్హా బుధవారం విడుదల చేశారు. ఈ ఏడాది అన్ని కేడర్లలో కలిపి 13 మంది అధికారులు ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఇందులో డైరెక్టర్ స్థాయి ఉన్న టీఎస్ఎల్‌డీఏ సీఈవో మంజువాణి మే 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈమెతో పాటు మరో ఐదుగురు జాయింట్ డైరెక్టర్ క్యాడర్ అధికారులు, ఏడుగురు డిప్యూటీ డైరెక్టర్ క్యాడర్ స్థాయి అధికారులు రిటైర్మెంట్ కానున్నారు.

బడ్జెట్ సమావేశాల్లో కులగణనపై చర్చిస్తాం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బీసీ కులగణనకు చట్టబద్ధత కల్పించే అంశంపై చర్చిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో బుధవారం బీసీ నాయకులు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, వైస్ ప్రెసిడెంట్ జీ నిరంజన్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపడుతామని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారని, సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల బీసీ కులగణనకు ఆదేశించారని చెప్పారు. బీసీ సంఘాలు, మేధావుల నుంచి బీసీ కులగణనపై సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్టు తెలిపారు. కులగణన శాస్త్రీయంగా జరగడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. విద్యార్థుల మెస్‌చార్జీల విడుదలలో జాప్యం జరగకుండా గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. శాసనసభ్యురాలు కాని ఎమ్మెల్సీ కవిత.. శాసనసభ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటుపై రాజకీయం చేయడం తగదని పేర్కొన్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	12.2°c	34.0°c
ఆదిలాబాద్	13.1°c	33.6°c
మెదక్	14.9°c	32.9°c
నల్లగొండ	16.4°c	33.6°c
వరంగల్	17.0°c	30.0°c
మహబూబ్‌నగర్	18.5°c	32.5°c
హైదరాబాద్	18.6°c	32.2°c
నిజామాబాద్	19.0°c	31.6°c
కరీంనగర్	19.0°c	32.0°c
ఖమ్మం	20.0°c	32.0°c

ఎమ్మెల్సీలుగా వెంకట్, మహేశ్‌గౌడ్ ప్రమాణం

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): శాసనమండలి సభ్యులుగా కొత్తగా ఎన్నికైన బల్మూరి వెంకట్, మహేశ్ కుమార్‌గౌడ్ ప్రమాణం చేశారు. బుధవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారితో తన చాంబర్‌లో ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేయించారు. వారిని అభినందించారు. మండలి నిబంధనలకు సంబంధించిన పుస్తకాలు, గుర్తింపు కార్డును అందజేశారు. పాడి కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరి రాజీనామా చేయడంతో ఏర్పడ్డ ఖాళీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వీరిద్దరు ఎన్నికయ్యారు.

మండల కేంద్రాల్లో ఇంటర్నేషనల్ స్కూళ్లు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యావ్యవస్థ పటిష్ఠతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రతి మండలకేంద్రంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. అందుకు కావాల్సిన భూములను గుర్తించాలని, విద్యాబోధన, వసతుల కల్పనపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో 2024-25 వార్షిక బడ్జెట్‌లో విద్యాశాఖ ప్రతిపాదనలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో అమలవుతున్న పథకాలు, విద్యావ్యవస్థ నిర్వహణపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఉపాధి కోర్సులను తీసుకురావాలని, విద్యార్థుల చదువు పూర్తికాగానే ఉద్యోగాలు వచ్చేలా కోర్సులు ఉండాలని సూచించారు. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో వర్సిటీలు లేనందున ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. అనుమతులు లేని ప్రైవేటు యూనివర్సిటీల అడ్మిషన్లపై వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు.

హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక

- సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లస్థాయి పెంపు
- మూడు నెలల్లో హోంగార్డుల నియామకం
- ట్రాఫిక్‌పై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ ట్రాఫిక్‌పై సమీక్షిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో డీజీపీ రవిగుప్తా, నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సమగ్ర ప్రణాళిక తయారుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ నిర్వహణ, నియంత్రణపై బుధవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణను పోలీస్ విభాగం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గ్రేటర్‌లో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సీఎం సూచించారు. మూడు నెలల్లోగా తగితనంతమంది హోంగార్డులను నియమించుకోవాలని ఆదేశించారు. అప్పటి వరకు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న హోంగార్డులను ట్రాఫిక్ విభాగానికి రప్పించాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో శాంతిభద్రతల విభాగం పోలీసులను కూడా గ్రేటర్‌లో ట్రాఫిక్ కంట్రోల్‌కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ప్రతి జంక్షన్‌లో పోలీసులు ఉండాల్సిందే

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల స్థాయిని పెంచాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అందుకు సరిపడా సిబ్బంది నియామకాలు చేపడతామని సీఎం తెలిపారు. ఆటోమెటిక్ సిగ్నలింగ్‌పై ఆధారపడకుండా ప్రతి జంక్షన్‌లో పోలీసులు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. మల్టీలెవల్ కార్ పార్కింగ్ సెంటర్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, సీఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం, అడిషనల్ డీజీ (ఇంటెలిజెన్స్) శివధర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బీఎఫ్ఎస్ఐ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) కన్సార్షియం ప్రతినిధులు బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అత్యంత కీలకమని, తమ ప్రభుత్వం వీటికి అత్యంత ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, బిజినెస్ రంగాల్లో సాంకేతిక నిపుణుల తయారీకి కన్సార్షియం కీలక పాత్ర పోషించాలని తెలిపారు.

చిత్తడి నేలల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): జీవ వైవిధ్యానికి ఆలవాలంగా నిలిచే చిత్తడి నేలల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అటవీ, పర్యావరణశాఖ మంత్రి, స్టేట్ వెట్ ల్యాండ్స్ అథారిటీ చైర్మన్ కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని చిత్తడి నేలలను పరిరక్షించుకోకపోతే భవిష్యత్తు తరాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. రాష్ట్రంలోని చిత్తడి నేలల పరిరక్షణ, గుర్తింపు తదితర అంశాలపై బుధవారం సచివాలయంలో ఆమె అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో రకాల మొక్కలు, పక్షులు, జంతువులకు ఆవాసంగా నిలుస్తున్న ఈ నేలలను గుర్తించి, వాటి పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. ఒక్కొక్క శాఖవారీగా చిత్తడి నేలలను గుర్తించి, నిపుణుల కమిటీకి సమర్పించాలని సూచించారు. ఆ కమిటీ మార్గనిర్దేశకాలతోపాటు, క్షేత్రస్థాయిలో పర్యటించి చిత్తడి నేలలను గుర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. తద్వారా వాటిని పరిరక్షించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతుందని మంత్రి సురేఖ చెప్పారు.

లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వచ్చే ఏడాది లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆయిల్‌పామ్ సాగుపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని, అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని మంత్రి తుమ్మల చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.97 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉన్నదని వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 52 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగైందని, వచ్చే ఏడాది లక్ష ఎకరాల్లో సాగు లక్ష్యం పెట్టుకోవాలని ఆదేశించారు. సంబంధిత కంపెనీలు ఫ్యాక్టరీల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయాభివృద్ధి ప్రణాళికలపైనా చర్చించారు.

వానకాలం విత్తనాలు సిద్ధం చేయాలి

వచ్చే వానకాలం కోసం విత్తనాలను సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి అధికారులను ఆదేశించారు. బుధవారం డైరెక్టరేట్‌లో విత్తనాల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. నాణ్యతలేని విత్తన విక్రయాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వేములవాడ గుడికి 20 కోట్లు

- వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర దేవస్థానానికి హెచ్ఎండీఏ నుంచి ఇవ్వాల్సిన రూ.20 కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించారు. వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీపై సీఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. వేములవాడలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేయాలని ఆదేశించారు. వేములవాడ చెరువు సుందరీకరణకు ప్రత్యేక నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలో మరో సమావేశం నిర్వహిస్తామని సీఎం చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వానికి కాగ్ రిపోర్ట్

హైదరాబాద్, జనవరి31 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) రూపొందించిన ఆడిట్ రిపోర్టు ప్రభుత్వానికి చేరింది. ఈ మేరకు తెలంగాణ అకౌంటెంట్ జనరల్ అనింద్యాదాస్ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో కాగ్ నివేదికపై చర్చించనున్నారు.

సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, గద్దర్ కూతురు వెన్నెల, కొడుకు సూర్యం, ప్రొఫెసర్ కంచె ఐలయ్య తదితరులు

సినీరంగంలో గద్దర్ పురస్కారాలు

- ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహం
- గద్దర్ మాటలే స్ఫూర్తిగా ప్రజాపాలన
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రవీంద్రభారతిలో గద్దర్ జయంతి వేడుకలు

రవీంద్రభారతి, జనవరి 31(నమస్తే తెలంగాణ): గద్దర్ పేరిట కవులు, కళాకారులతోపాటు సినీరంగంలో పురస్కారాలు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడాలన్న గద్దర్ మాటలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తి అని పేర్కొన్నారు. గద్దర్ జయంతి వేడుకలు బుధవారం రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహించారు. రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీగౌడ్, గద్దర్ సతీమణి విమల, కుమారుడు సూర్య, కుమార్తె వెన్నెల తదితరులు హాజరయ్యారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు, ప్రజా తెలంగాణ కోసం ప్రజాయుద్ధనౌక గద్దర్ గజ్జెకట్టి ప్రజలను చైతన్యం చేశారని కొనియాడారు. వచ్చే ఏడాది నుంచి గద్దర్ జయంతి రోజున పురస్కారాలు అందజేస్తామని, వచ్చే జయంతి నాటికి ట్యాంక్‌బండ్‌పై